


# విజయభాను





విశాఖపట్నం, బుధవారం 13-12-2017 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 90 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## వంగపండుకు అంతర్జాతీయ అవార్డు



విశాఖపట్నం : ప్రముఖ ప్రజా కవి, జానపద కళారత్న వంగపండు ప్రసాదరావుకి సుప్రసిద్ధ అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా రంగస్థల రత్న అనే పురస్కారాన్ని ప్రదానం చెయ్యనుంది. ఈ నెల 16వ తేదీన ఏలూరులో జరగనున్న 4వ అంతర్జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా పురస్కారం ఇవ్వనున్నట్లు డాక్టర్ ప్రసాద్ తోటకూర తరువాయి 2లో

## ముగిసిన రెండో విడత

# ఎన్నికల ప్రచారం

- శాంతిభద్రతల దృష్ట్యా మోదీ రోడ్‌షోకు అనుమతి నో
- సముద్ర విమానంలో మోదీ ప్రయాణం
- మోదీ.. మోదీ.. అంటూ బీజేపీ కార్యకర్తలు నినాదాలు
- అంబాజీ కోవెలలో ప్రధాని ప్రత్యేక పూజలు
- ప్రజలకు మోదీ అభివాదం



అహ్మదాబాద్ : ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారిగా సముద్ర విమానంలో ప్రయాణించారు. గుజరాత్ రెండో విడత ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈ నేపథ్యంలో అహ్మదాబాద్‌లో రోడ్‌షో నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది.

అయితే శాంతిభద్రతల ద ృష్ట్యా మోదీ రోడ్‌షోకు అహ్మదాబాద్ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో మోదీ సబర్మతీ నది నుంచి ధారోయ్ డ్యామ్ వరకు మోదీ సీప్లేన్‌లో ప్రయాణించారు. అక్కడి నుంచి అంబాజీ టెంపుల్‌కు రోడ్డు మార్గాన చేరుకుని దేవున్ని దర్శించుకుంటారు. అనంతరం ఎన్నికల ప్రచారంలో మోదీ పాల్గొంటారు.

### మోదీ.. మోదీ.. అంటూ నినాదాలు

ప్రధాని మోదీ సీప్లేన్ ప్రయాణం నేపథ్యంలో సబర్మతీ నదీతీరం వద్దకు బీజేపీ కార్యకర్తలు, మోదీ అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

మోదీ అక్కడికి చేరుకోగానే.. మోదీ.. మోదీ.. అంటూ బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. విమానం ఎక్కే ముందు ప్రజలకు మోదీ అభివాదం చేశారు.

## ఇరాన్‌లో భూకంపం..

ఇరాన్: ఇరాన్‌లోని కెర్మాన్ ప్రావిన్స్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్‌స్కేల్‌పై భూకంప తీవ్రత 6.2గా నమోదైంది. హెజ్డాక్ పట్టణానికి సమీపంలో భూకంప కేంద్రం నమోదైనట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. అయితే భూకంపం ధాటికి జరిగిన నష్టానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## భారత్ అమ్ములపొదిలో మరో అధునాతన అస్త్రం..!

న్యూఢిల్లీ: భారత సైన్యం అమ్ముల పొదిలోకి మరో అధునాతన ఆయుధ వ్యవస్థ చేరనుంది. రష్యన్ ఎస్-400 ట్రయంప్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ విక్రయ ఒప్పందంపై భారత్, రష్యా త్వరలోనే సంతకాలు చేయనున్నట్టు తెలుస్తోంది. .దీనికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకుంటున్నట్టు రష్యా వెల్లడించింది. ధర, శిక్షణ, సాంకేతికత బదిలీ, నియంత్రణ వ్యవస్థల ఏర్పాటు గురించి భారత్, రష్యా మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికిప్పుడు ఎస్-400ను సరఫరా చేసినా వ్యవస్థ గురించి శిక్షణనిచ్చేందుకు రెండేళ్లు పడుతుంది.

రష్యా నుంచి ఐదు బిలియన్ డాలర్లతో ఎస్-400 ట్రయంప్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ కొనుగోలు చేస్తామని గతేడాది అక్టోబర్‌లో భారత్ ప్రకటించింది. దాంతోపాటు రెండు దేశాలు సంయుక్తంగా కమోవ్ హెలికాప్టర్ల తయారీ చేపడతాయని పేర్కొంది. గోవాలో బ్రిక్స్ దేశాల సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ రష్యా తరువాయి 2లో



## పాట్నాలో పెద్ద నోట్లు నిలిపివేత

పట్నా: బిహార్ రాజధాని పట్నా వాసులు పెద్ద నోట్ల కొరతతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్నాలోని పలు ఏటీఎంలకు రూ.500, రూ.2000 నోట్ల సరఫరా నిలిచిపోయింది. ఆర్‌బీఐ నుంచి పెద్ద నోట్ల సరఫరా ఆగిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన దాదాపు 300 ఏటీఎంలకు పెద్ద నోట్ల సప్లై ఆగిపోవడంతో అక్కడి ప్రజలకు ఇక్కట్లు మొదలయ్యాయి. ఈ ఘటనతో మరోసారి పెద్ద నోట్లు రద్దైనట్లుగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్‌బీఐతో మాట్లాడే యోచనలో ఉన్నట్లు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సయ్యద్ ముజఫర్ వెల్లడించారు. త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. మరోపక్క గుజరాత్ ఎన్నికల నేపథ్యంలో పెద్ద నోట్లను అక్కడికి తరలించడంతోనే ఇక్కడ నిలిచిపోయినట్లు ఆర్జేడీ నేతలు విమర్శలు చేస్తున్నారు. అక్కడ పెద్దనోట్లతో ఓట్లు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై భాజపా నేత మంగళ్ పాండే మాట్లాడుతూ.. ఆర్జేడీ గుజరాత్ ఫోబియాతో బాధపడుతోందని చురకలంటించారు. తాత్కాలిక సమస్యలకు అనవసరంగా ఆగ్రహం వ్యక్తం చేయకూడదని త్వరలో సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు.

## కేసులున్న ఎంపీలు, ఎమ్మెల్యేలకు చేదు వార్త

**కేసు విచారణకు ప్రత్యేక న్యాయస్థానం .. కేంద్రానికి తెలిపిన సుప్రీంకోర్టు**



న్యూఢిల్లీ : పార్లమెంటు, శాసనసభల సభ్యులపై కేసుల విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటుకు అంగీకరిస్తున్నట్లు సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రారంభంలో 12 ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేస్తామని తెలిపింది. వీటి కోసం రూ.7.80 కోట్లు కేటాయించినట్లు వివరించింది. దేశవ్యాప్తంగా ఎంతమంది ఎమ్మెల్యేలు, ఎంపీలపై పెండింగ్‌లో ఉన్న కేసుల సమాచారాన్ని తెలుసుకుని, అవసరమైన ప్రత్యేక కోర్టుల సంఖ్యను నిర్ధారించేందుకు తమకు కొంత సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది.

2014నాటికి 1,581 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై 13,500 కేసులు విచారణలో ఉన్నాయి. ఈ సంఖ్య రాన్రానూ పెరుగుతోంది. ప్రత్యేక కోర్టుల ఏర్పాటుతో ఈ కేసుల విచారణలో జరుగుతున్న అసాధారణ జాప్యాన్ని నివారించగలిగే అవకాశం కనిపిస్తోంది.

రాజకీయ నేతలపై కేసుల విచారణలో వేగాన్ని పెంచేందుకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు కోరడంతో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సాధ్యమైనంత త్వరగా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని 2015లో కోరింది. రాజకీయ నేతలపై కేసుల్లో విచారణ ఒక ఏడాదిలో పూర్తయ్యేవిధంగా, తీర్పులు వెలువడే విధంగా ఈ కోర్టుల ఏర్పాటు జరగాలని తెలిపింది. ఈ అంశాన్ని గత నెలలో మరోసారి కేంద్రానికి గుర్తు చేసింది.

## కాంగ్రెస్ గెలిచి తీరుతుంది



అహ్మదాబాద్: గుజరాత్‌లో తొలి విడత అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ తప్పకుండా గెలుస్తుందన్న నమ్మకం మరింత పెరిగిందని ఆ పార్టీ నూతన అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. జగన్నాథ ఆలయాన్ని దర్శించుకొన్న అనంతరం అహ్మదాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాలకు వెళ్లడంపై భాజపా చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. ఏ సమయంలోనైనా నాకు ఆలయాలకు వెళ్లే హక్కు ఉంది. నేను కేదారినాథ్ కూడా వెళ్లాను. నేను ఆలయాలకు వెళ్లేది తరువాయి 2లో






## వైకుంఠ ఏకాదశికి తిరుమలలో ప్రత్యేక ఏర్పాట్లు



తిరుమల: వైకుంఠ ఏకాదశికి తిరుమలలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఈ నెల 29న ఏకాదశి, 30న ద్వాదశి రానుంది. ఏకాదశి శుక్రవారం రావటంతో శ్రీవారి దర్శనం నాలుగు గంటలు ఆలస్యం కానుంది. ఏకాదశి నాడు ఉదయం ఐదున్నర గంటలకు వీఐపీ దర్శనం, 8 గంటలకు సర్వదర్శనం ప్రారంభమవుతుందని జేఈఓ శ్రీనివాస రాజు తెలిపారు. డిసెంబర్ 28 నుంచి జనవరి ఒకటో తేదీ వరకు దివ్య దర్శనం, ఆర్జిత సేవలు, ప్రివిలేజ్ దర్శనాలు, సిఫార్సు లేఖలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఏకాదశినాడు ఆరు వీఐపీ తరువాయి 2లో

# ఇంటింటికీ టిడిపిలో ఎమ్మెల్యే పంచకర్ల



అచ్యుతాపురం: ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో బాగంగా యలమంచిలి ఎమ్ఎల్ఎ పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం మండలంలో గల తిమ్మరాజుపేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం తిమ్మరాజుపేట గ్రామంలో ఇటీవలే కరెంట్ షాక్ వలన మరణించిన కాటకోట మురళి భార్య గీతకు చంద్రన్న భీమా పథకం ద్వారా మంజూరైన రూ 4.25 లక్షల చెక్కును అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పిపి చేకూరి శ్రీనివాసరాజు, జెడ్‌పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, వైస్ ఎమ్‌పిపి రాజాన రమేష్‌కుమార్, మునగపాక ఎమ్‌పిపి ఆడారి మంజూ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి పరిహారం అందజేత



రావులపాలెం : సోమసుందరరెడ్డి నగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఇంజరపు సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో స్థానిక శాసన సభ్యులు చిర్ల జగ్గిరెడ్డి అతని కుటుంబ సభ్యుల్ని మంగళవారం పరామర్శించి ప్రభుత్వ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా విడుదలైన రూ.5,20, 000/- లు నగదును అతని భార్య వెంకటలక్ష్మికి అందజేసారు. అనంతరం ముసలి రామాలయ ప్రాంగణంలో గల షిర్డిసాయి ఆలయంలో దత్త మాలాదారులతో సహపంక్తి భోజనం చేసారు. ఈ సందర్భముగా గురుస్వామి సుదర్శనం నరసింహాచార్యులు, భూపాలరెడ్డి, దత్త మాలాదారులు జగ్గిరెడ్డిని సన్మానించి దేవుని చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గొలుగూరి మునిరెడ్డి, బొక్కా ప్రసాద్, అప్పారి విజయకుమార్, మన్యం భాను, కొవ్వూరి సుధాకరరెడ్డి, లేబర్ ఆఫీసరు ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు స్మార్ట్ శిక్షణ

## సిడిపిఒ శ్రీకళ



నర్సీపట్నం : స్త్రీశిశు సంక్షేమశాఖలో పారదర్శకంగా వేగంగా సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్ శిక్షణ ఇస్తున్నట్లు సిడిపిఒ ఎం.శ్రీకళ తెలిపారు. సిఎఎస్ కామన్ అప్లికేషన్ సిస్టమ్‌లో 8 మాడ్యూల్స్‌కు సంబంధించి 10 రోజుల పాటు శిక్షణ ఉన్నట్లు చెప్పారు. విడతల వారీగా రెండు నెలల్లో ఈ శిక్షణ పూర్తి చేస్తామన్నారు. ప్రతీ 15 రోజులకు బ్యాచ్‌ల వారీగా మూడు రోజులు శిక్షణ కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం కుటుంబ నిర్వహణపై ట్యాబ్‌ల ద్వారా అప్‌లోడ్ చేయడంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. తర్వాత రోజువారీ న్యూట్రీషన్ సందర్శనల ప్యానల్, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ, ఇంటింటి రేషన్ మొదలైన వాటిపై శిక్షణ ఉంటాయన్నారు. ప్రాజెక్టు పరిదిలో 232 మంది కార్యకర్తలకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. సూపర్‌వైజర్లు శిక్షణ ఇస్తుండగా పిఒ పర్యవేక్షణ చేస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో ఏసిడిపిఒ జివి. రమణి, సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

# పోలీసు కన్వెషన్ హాల్ అద్దె తగ్గించండి ఎస్పీకి వినతి



కాకినాడ : పోలీసు కన్వెషన్ హాలు అద్దె తగ్గించి అందుబాటులోనికి తీసుకురావాలని జిల్లా పోలీసు అసోషియేషన్ ఆధ్వర్యంలో ఎస్పీ విశాల్ గున్నికి వినతి పత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎస్పీ పోలీసు సిబ్బందికి రూ.30 వేలనుండి, రూ .20 వేలకు, ఇతరులకు రూ. 75 వేల నుండి 62వేల ఐదు వందలకు తగ్గించారన్నారు. పోలీసు కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే కన్వెషన్ హాల్ కు అద్దె రేటు తగ్గించడంపై అసోషియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేసారు. అనంత రం జిల్లా అధ్యక్షుడు బ్రమ్మాజీ, గౌరవాధ్యక్షుడు బలరాం, రంగా ప్రసాద్ తదితరులు ఎస్పీ విశాల్ గున్నికి కృతజ్ఞతా పూరకంగా పూలగుచ్ఛం అందించి తమ ఆనందం వ్యక్తం చేసారు.

# ఈ నెల 16 నుండి ధనుర్మాస పూజలు ప్రారంభం

రావులపాలెం : కోనసీమ ముఖద్వారం రావులపాలెంలో వేంచేసియున్న సీతారామచంద్రస్వామి, షిర్డిసాయి బాబా వార్ల ఆలయంలో ఈ నెల 16 నుండి జనవరి14వరకు ధనుర్మాస వ్రత మహోత్సవములు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి తెలిపారు. ఈ నెల 29న ముక్కోటి ఏకాదశి రోజున అష్టోత్తర శతనామార్చన విశేష అలంకరణ దర్శనము చేస్తామని ఆయన తెలిపారు. జనవరి 5 సప్తమి శుక్రవారం స్వామివార్కి సహస్రనామాచర్చన, గ్రామ ప్రదక్షిణ, విశ్వక్సేన పూజ, మూలవిరాట్‌కు అభిషేకం, సీతాదేవి, గోదాదేవి అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహిస్తామని, 7 ఆదివారం పాసురం సందర్భముగా శ్రీకృష్ణ, గోదాదేవి అమ్మవార్లను సింహాసనంపై వేయించింపజేసి అర్చన విశేష హారతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 8న, 11న, 14 భోగి రోజున గోదాదేవి రంగనాధుల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు.

## మహిళా కండక్టర్లకు ప్రత్యేక చార్ట్ వేయాలి

రావులపాలెం : ఆర్టీసి కార్మికుల రక్షణ, సంస్థ పరిరక్షణకై మంగళవారం రావులపాలెం బస్టాండు ఆవరణలో ఎసిఎస్ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో దర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జోనల్ అసిస్టెంట్ సెక్రటరి సిహెచ్.వి.పి. బాబు పాల్గొని మాట్లాడుతూ ఎమ్‌టియు యాక్టు పరిధిలో షెడ్యూలు సవరించాలని, పెండింగులో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు ఇవ్వాలని, కాంట్రాక్టు డ్రైవర్లు, కండక్టర్లను రెగ్యులర్ చేయాలని, మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటీ చార్ట్ వేయాలని, ఉద్యోగి సాదారణ మరణానికి 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండు చేసారు. ఈ దర్నాలో డిపో సెక్రటరి శ్రీను, గేరేజ్ సెక్రటరి ఎమ్. రామకృష్ణ, ఎల్‌వి రమణ, ఆర్.ఎస్.రావు, ఎమ్.ఆర్. కృష్ణ, జి. భద్రయ్య, సి.హెచ్.ఎస్. రాజు, ఆర్టీసి కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా రాజశేఖర్ పుట్టిన రోజు వేడుకలు

నర్సీపట్నం : ఘనంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజశేఖర్ పుట్టిన రోజు వేడుకలు అభిమానులు మంగళవారం నిర్వహించారు. నర్సీపట్నంలోని వైయస్సార్ ఆసుపత్రిలో నర్సీపట్నంలోని రాజశేఖర్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ వైయస్సార్ పార్టీకి చెందిన పలు గ్రామాల, పట్టణ నాయకులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని డాక్టర్లు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ముందస్తుగా నారుమళ్ళు వేసుకోవాలి



రావులపాలెం : దాళ్వా సాగుకు రైతులు ముందస్తుగా నారుమళ్ళు వేసుకోవాలని వ్యవసాయాధికారిణి మీన తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది. కార్యక్రమంలో భాగంగా మండల పరిధి వెదిరేశ్వరం, కేతరాజుపల్లి, రావులపాడు గ్రామాల్లో గల రైతులకు పలు సూచనలు చేసారు. నాణ్యమైన విత్తనాలను వాడుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాదించవచ్చని, సమయాభావం వల్ల నారుమళ్ళు వేయలేని రైతులు వెదజల్లాలని సూచించారు. వీరితోపాటు ఏఏఓ నానిబాబు, పితాని శ్రీనివాస్, ఎమ్‌పిఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బాలికపై అత్యాచారం చేసిన ఉపాధ్యాయుడిని శిక్షించాలి

కొయ్యూరుః గిరిజన బాలికను నిర్బంధించి అత్యాచారం చేసిన గూడెంకొత్తవీధి ఏకలవ్య ఉపాధ్యాయుడు వీసం రామకృష్ణను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి శాశ్వతంగా ఉద్యోగం నుండి తొలగించాలని కాకరపాడు మూడు రోడ్ల కూడలిలో రాస్తారోకో చేపట్టారు. గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉదయం రాస్తారోకో చేసి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.సూరిబాబు మాట్లాడుతూ బాధిత విద్యార్దినికి ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని, ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంతల బంగారు, చలపతి, ఆనంద్‌పవన్‌కుమార్, మత్సరాజు, సిఐటియు నాయకులు వై.అప్పలనాయుడు, కళాశాల అధ్యాపకులు శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# తూర్పునియోజకవర్గ కార్యాలయంలో వైఎస్ఆర్‌సిపి సమావేశం



విశాఖపట్నం : మంగళవారం మద్దిలపాలెం తూర్పునియోజకవర్గ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకులు సమావేశంలో వైఎస్ఆర్‌సిపి తూర్పునియోజకవర్గ ఇంఛార్జి వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ శనివారం గ్రీన్‌సిటీలో జరిగిన పోలింగ్ బూత్ శిక్షణతరగతులు విజయవంతంచేసిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. రానున్న కాలంలో జరగబోయే ప్రతి కార్యక్రమంలో ప్రతిఒక్కరు కుటుంబ సభ్యులతో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కొయ్యప్రసాద్ రెడ్డి, శివరామకృష్ణ, అజిమ్‌అలీ, రవిరెడ్డి, పాత్రుడు, మూర్తియాదవ్, మాజీ కార్పొరేటర్, మొల్లుఅప్పారావు, నాడింపల్లి కృష్ణరాజు, వార్డు అధ్యక్షులు సిటీ, స్టేట్ నాయకులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## వంగపండుకు అంతర్జాతీయ అవార్డు

(ఎపిఎఫ్ ప్రెసిడెంట్) ఉత్తర్వులు పంపించారు. జానపద కళలలో చేసిన రచనలకు, కృషికి ప్రతిగా వంగపండుకు ఈ అవార్డు ఇవ్వనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ హాజరు కానున్నట్లు వంగపండు తెలిపారు. ఈ అవార్డును అందుకోనున్న వంగపండును పలువురు అభినందించారు.

## భారత్ అమ్ములపొదిలో మరో అధునాతన అస్త్రం..!

అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చించిన తర్వాత ఈ ఒప్పందం గురించి ప్రకటించారు..

## వైకుంఠ ఏకాదశికి తిరుమలలో ప్రత్యేక ఏర్పాట్లు

దర్శన టికెట్లు, రాజ్యాంగేతర వీఐపీలకు నాలుగు వీఐపీ దర్శన టికెట్లు కేటాయిస్తామన్నారు. ఏకాదశి దర్శనానికి వచ్చే భక్తులను 28న ఉదయం 10 గంటలకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కి అనుమతిస్తామని జేఈఓ చెప్పారు. తిరుమలలో అదనంగా ఆరు కిలోమీటర్ల క్యూలైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ద్వాదశి నాడు వీఐపీ దర్శనాలు రద్దు చేశామని, భక్తులకు నిరంతరం ఆహారం, నీరు అందిస్తామని జేఈఓ అన్నారు.

## కాంగ్రెస్ గెలిచి తీరుతుంది

గుజరాత్ ప్రజల భవిష్యత్ బాగుండాలని, అభివృద్ధి చెందాలని. ఆలయాలకు వెళ్లడం తప్పా? అని రాహుల్ ప్రశ్నించారు.

గుజరాత్‌లో భాజపాను ఓడించేందుకు పాక్‌తో కాంగ్రెస్ చేతులు కలిపిందని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌నుద్దేశించి ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను రాహుల్ తప్పుబట్టారు. మన్మోహన్‌ను ఉద్దేశించి మోదీ చేసిన వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదు. ఆయన గతంలో దేశానికి ప్రధానిగా పనిచేశారు. అలాంటి వ్యక్తి గురించి ఇలా మాట్లాడాన్ని మేము ఎంతమాత్రం అంగీకరించం అని పేర్కొన్నారు.

మోదీనుద్దేశించి మణిశంకర్ అయ్యర్ చేసిన వ్యాఖ్యల గురించి కూడా రాహుల్ ప్రస్తావించారు. అటువంటి వ్యాఖ్యలు చేయడాన్ని పార్టీ అంగీకరించదని ఆయన తెలిపారు. గుజరాత్‌లో రెండో విడత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగియనుంది. ఈనెల 14న రెండో విడత ఎన్నికలు జరగనుండగా.. 18న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ తమ ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశారు.

# మరో రికార్డు చేరువలో ధోని



హైదరాబాద్ : వన్డేల్లో 300 పైగా మ్యాచ్‌లు.. అత్యధిక నాటౌట్‌లు.. స్టంప్ అవుట్‌లతో ఈ ఏడాది రికార్డులు సృష్టించిన టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని మరో మైలు రాయి చేరువలో ఉన్నాడు. వన్డేల్లో 10 వేల పరుగుల మార్క్ దాటడానికి ధోని ఇంకా 109 పరుగుల దూరంలో ఉన్నాడు.

భారత్-శ్రీలంక రేపటి మ్యాచ్‌లో ధోని ఈ పరుగులు చేస్తే వేగంగా 10 వేల పరుగులు పూర్తి చేసిన నాలుగో బ్యాట్స్‌మన్‌గా రికార్డులకెక్కనున్నాడు. 259 ఇన్నింగ్స్‌ల్లో సచిన్ 10 వేల మార్క్‌ను అందుకోగా సౌరవ్ గంగూలీ 263, రికీ పాంటింగ్ 266, జయసూర్య 272 ఇన్నింగ్స్‌ల్లో ఈ మార్క్‌ను అందుకున్నారు. ధోని ప్రస్తుతం 267 ఇన్నింగ్స్‌ల్లో 9,891 పరుగులు చేశాడు. మిగిలిన 109 పరుగులను ఒక ఇన్నింగ్స్‌లో లేకపోతే రెండు మూడు, నాలుగు ఇన్నింగ్స్‌లు తీసుకున్నా జయసూర్య స్థానాన్ని అధిగమిస్తాడు. అంతేగాకుండా 10 వేల మార్క్‌ను అందుకున్న నాలుగో భారత బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందనున్నాడు. ఈ జాబితాలో సచిన్, గంగూలీ, ద్రవిడ్‌లు ముందున్నారు.

ఇప్పటికే ఈ ఏడాది అత్యధిక పరుగులు చేసిన టీమిండియా ప్లేయర్లలో ధోని నాలుగో స్థానంలో ఉన్నాడు. కోహ్లి(1460) పరుగులతో అగ్రస్థానంలో ఉండగా రోహిత్ శర్మ(1078), శిఖర్ ధావన్(792), ధోని(781)లు తరువాతి వరుసలో ఉన్నారు. శ్రీలంకపై స్థిరమైన బ్యాటింగ్‌తో రాణిస్తున్న ధోని గత ఎనిమిది మ్యాచుల్లో 4 అర్ధ సెంచరీలు సాధించాడు.

ఇక తరువాయి మ్యాచ్‌లో మరో 11 పరుగులు చేస్తే ధోని మోహాలీ మైదానంలో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందుతాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు సచిన్ పేరిట ఉంది. ఇక తొలి మ్యాచ్‌లో క్లిష్ట పరిస్థితిల్లో అర్ధసెంచరీతో భారత పరువును కాపాడిన ధోని మంచి ఫామ్‌లో ఉన్నాడు.

# వాట్సప్ లీకులు సీరియస్‌గా సెబీ విచారణ


ముంబయి: స్టాక్ మార్కెట్ వర్గాల్లో సంచలనం సృష్టించిన వాట్సప్ లీకులపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సీరియస్‌గా ఉంది. నమోదిత కంపెనీలు అధికారికంగా ప్రకటించకముందే కొందరు వ్యక్తులు సోషల్‌మీడియా గ్రూపుల్లో ఆర్థిక ఫలితాల సమాచారం బహిర్గతం చేయడంపై విచారణ చేపట్టింది. సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగీ మంగళవారం ఈ విషయం స్పష్టం చేశారు. సోషల్ మీడియా గ్రూపుల్లో ప్రముఖ కంపెనీల ఆర్థిక ఫలితాల సమాచారం ముందుగానే బయటకు పొక్కిన సంగతి తమ దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు.

తీవ్రంగా పరిగణిస్తున్నాం ..

మేం వాట్సప్ లీకులను తీవ్రంగా పరిగణిస్తున్నాం. షేర్ల ధరలపై అత్యంత ప్రభావం చూపించే కంపెనీల ఆర్థిక ఫలితాల సమాచారం ముందుగానే బయటకు పొక్కుతుంటే ఏం పట్టనట్టు కూర్చోలేం అని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సదస్సు తర్వాత త్యాగీ చెప్పారు.

# వందే మాతరంపై పిటిషన్...

## సుప్రీంకోర్టు స్పందన...



న్యూఢిల్లీ : వందే మాతరంపై ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రత్యేక అనుమతి అర్జీని సుప్రీంకోర్టు తిరస్కరించింది. జనగణమనతో సమానంగా వందే మాతరంనకు కూడా చట్టబద్ధమైన రక్షణ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చడంతో పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ప్రత్యేక అనుమతి అర్జీపై సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఏ ఎం ఖన్విల్కర్, జస్టిస్ డీ వై చంద్రచూడ్ ప్రముఖ న్యాయవాది ప్రవీణ్ హెచ్ పరేఖ్ వాదనలను విన్నారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను వ్యతిరేకిస్తూ దాఖలైన ఈ ప్రత్యేక అనుమతి అర్జీ (స్పెషల్ లీవ్ పిటిషన్)ను తోసిపుచ్చారు. గౌతమ్ మొరార్కా వందే మాతరంపై ఢిల్లీ హైకోర్టులో ఓ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. జాతీయ గీతంతో సమానంగా గౌరవ, మర్యాదలను పొందే అర్హత జాతీయ గేయం వందే మాతరంనకు ఉందని పేర్కొన్నారు. అటువంటి గౌరవ, మర్యాదలు పొందడానికి వీలు కల్పిస్తూ జాతీయ గౌరవానికి అవమాన నిరోధక చట్టం, 1971లో సవరణలకు ఆదేశించాలని కోరారు.


ఢిల్లీ హైకోర్టు స్పందిస్తూ వందే మాతరంనకు స్వాతంత్ర్య సంగ్రామంతో విడదీయలేని అనుబంధం ఉందని తెలిపింది. దీనిని కమిటీ, ప్రతివాదులు కూడా గుర్తించారని పేర్కొంది. చట్టం ద్వారా అమలు చేయడం కానీ, అనుకున్న పని జరిగేలా చేయడం కానీ లేకుండా గౌరవం, ప్రేమలను పొందగలిగే శాశ్వత గేయమని అందరూ అంగీకరించారని తెలిపింది. శౌర్య, పరాక్రమాలు, మాతృభూమిపట్ల అంకితభావం, ప్రేమలకు పర్యాయపదంగా వందే మాతరం నిలుస్తుందని గుర్తించారని తెలిపింది. పిటిషనర్ వాదనపై వివాదం లేనప్పటికీ, రిట్ పిటిషన్‌లో చేసిన విజ్ఞప్తిని మంజూరు చేయజాలమని చెప్తూ, పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీనిపై పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయినా పిటిషనర్‌కు ఉపశమనం దొరకలేదు.

# విజయభాను సంపాదకీయం

## సన్నిహిత సంబంధాలుండాలి


నేపాల్ ఎన్నికలలో చైనాకు అనుకూలంగా ఉండే కమ్యూనిస్టు కూటమి పైచేయి సాధించినప్పటికీ, భారత్ మరీ భయపడవలసిందేమీ లేదు. కాకపోతే మన దేశం వ్యూహంలో ఎక్కడ పొరపాటు జరిగిందో సమీక్షించుకొని జాగ్రత్తగా వ్యవహరించవలసి ఉంటుంది. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ, నేపాల్‌లో రాజ్యాంగ వ్యవస్థ స్థిరపడటం అనుకూల పరిణామంగా భావించాలె. నేపాల్ రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న తరువాత ఇవి మొదటి ఎన్నికలు. పార్లమెంటుకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. ప్రజాస్వామిక, గణతంత్ర సమా ఖ్య స్వరూపం గల రాజ్యాంగం ఆధారంగా నేపాల్ తన గమ్యాన్ని నిర్దేశించుకుంటున్నది. నేపాల్ ప్రజలు రాచరికానికి వ్యతిరేకంగా తీవ్ర పోరాటం చేయడంతో 2006 రాజు దిగిపోక తప్పలేదు. రెండేండ్ల తరువాత నేపాల్‌లో రాచరికం రద్దయింది. శతాబ్దాలుగా పాతుకుపోయిన రాచరిక వ్యవస్థను కూలదోయడం నేపాలీ ప్రజలు సాధించిన గొప్పవిజయం. కానీ ప్రజాస్వా మ్య వ్యవస్థను ఏర్పరుచుకునే క్రమంలో అనేక అవాంతరాలు ఎదురయ్యాయి. రాజకీయ అస్థిరత నెలకొంది. పదకొండేండ్లలో పది మంది ప్రధానులయ్యారు. రాజ్యాంగ స్వరూపంపై ఏకాభిప్రాయం లేదు. జాతీయస్థాయిలో స్థూల అవగాహన ఏర్పడటంతో 2015లో రాజ్యాంగం ఆమోదం పొందింది. కానీ కొత్త రాజ్యాంగం పట్ల దక్షిణాన ఉన్న మధేసీలు అసంతృప్తి వ్యక్తం చేసి, ఆందోళనకు దిగారు. మధేసీల ఆకాంక్షలను కొంత మేర ఆమోదించిన అనంతరం ఎన్నిక లు విజయవంతంగా జరిగాయి. ఉత్తర దక్షిణ ప్రాంతాలలో రెండు విడుతలుగా జరిగిన పోలింగ్‌లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కమ్యూనిస్టు కూటమి విజయం సాధించినం దువల్ల స్థిరమైన ప్రభుత్వం ఏర్పడే సూచనలు ఉన్నాయి. భారత్‌కు, చైనాకు మధ్య ఉన్న తటస్థ రాజ్యమైనందు వల్ల నేపాల్‌లో రెండు పెద్ద దేశాలు తమ ప్రాబల్యం కోసం ప్రయత్నాలు చేస్తుంటాయి. నేపాల్‌కు ఏ వస్తువులు అవసరమైనా భారత్ నుం చే సరఫరా కావాలె. చైనా పొరుగు రాజ్యం అనిపించినప్పటికీ, హిమాలయాలు సరిహద్దుగా ఉన్నందు వల్ల అక్కడి నుంచి సరుకుల రవాణా కష్టం. దూర భారం వల్ల ధరలు కూడా ఎక్కువ చెల్లించాల్సి ఉం టుంది. భారత్‌తో నేపాలీలకు సన్నిహిత సంబంధాలు మొదటి నుంచి ఉన్నాయి. మతపరమైన సారూప్యం కూడా కారణం. అక్కడి రాజకీయాలపై భారత్ ప్రభావం ఎక్కువ. రాచరిక పాలనలో, ప్రజాస్వామ్య ఉద్యమాలలో భారత్ మాట చెల్లుబాటు అయ్యేది. అయినప్పటికీ చైనాకు అనుకూలంగా ఉండే కమ్యూనిస్టు కూటమి గెలువడానికి కారణమేమిటనేది ఆలోచించాల్సిన విషయం. ప్రధాని మోదీ అధికారానికి వచ్చిన వెంటనే ఇరుగు పొరుగు దేశాలతో సత్సంబంధాలకు ప్రాధాన్యం ఇస్తామనే సందేశం పంపించారు. ప్రమాణ స్వీకారానికి కూడా పొరుగు దేశాల వారిని ఆహ్వానించా రు. కానీ మోదీ ప్రభుత్వం అనుసరించిన కొన్ని విధానాల వల్ల నేపాల్ ప్రజల స్వాభిమానం దెబ్బతిన్నది. భారత్ నుంచి వస్తు సరఫరా ఆగిపోతే, నేపాల్‌లో జన జీవనం అస్తవ్యస్తమైపోతుంది. ఈ బలహీనతను ఆసరాగా చేసుకొని, భారత్ తమను ఆటాడిస్తున్నదనే అభిప్రాయం అక్కడి ప్రజలలో ఏర్పడ్డది. గతంలో కూడా నేపాల్‌కు సరఫరా చేసి దిగ్బంధించిన సందర్భాలు ఉన్నాయి. ఇదే రీతిలో 2005లో కొత్త రాజ్యాంగంపై దక్షిణాన ఉన్న మధేసీలు నిరసనలు తెలిపారు. దీనిని సాకుగా చూపి భారత్ నేపాల్‌కు వస్తువుల రవాణా నిలిపివేసింది. ఈ కారణంగా నేపాల్‌లో భారత వ్యతిరేకత బాగా వ్యాపించింది. భారత్ దిగ్బంధం సాగినప్పుడు, నేపాల్ పరిస్థితి గమనించిన చైనా సరిహద్దు మీదుగా కొంత మేర అత్యవసర పదార్థాలను సరఫరా సాగించింది. రెండు దేశాల మధ్య రోడ్డు, రైలు మార్గాలకు ఒప్పందం కుదుర్చుకున్నది. దీంతో భారత్ ఇబ్బంది పెట్టినప్పుడు తాము చైనా అండతో నిలబడగలమనే భరోసా నేపాలీలకు లభించింది. చైనా అనుసరించే విధానానికి చెక్ బుక్ డిప్లమసీగా పేరున్నది. నేపాల్ అవసరాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి ప్రాజెక్టు లు నిర్మిస్తున్నది. ప్రజల మనోభావాలను గ్రహించిన కమ్యూనిస్టు, మావోయిస్టు పార్టీలు తమ విభేదాలను అధిగమించి ఒక కూటమిగా పోటీ చేశాయి. వీటిని ఏకతాటిపైకి తేవడం వెనుక చైనా హస్తమున్నదనే అభిప్రాయం ఉన్నది. చైనా ప్రాబల్యం ఇంతగా ఉన్నప్పటికీ, భారత్‌కు పరిస్థితి చేజారి పోలేదు. నేపాల్‌లో భారత అనుకూల పార్టీ గెలిచినా పూర్తిగా చైనా వ్యతిరేకతను ప్రదర్శించలేదు. ఇదే విధంగా చైనా అనుకూల పార్టీలు అధికారం చేపట్టినా భారత్ పట్ల వ్యతిరేకంగా ఉండలేవు. భౌగోళికంగా నేపాల్ భారత్‌తో సన్నిహిత సంబంధాలు నెలకొల్పు కోక తప్పదు.

## మోదీ ఐఎస్ఐ వాళ్లను పిక్నిక్‌కు తీసుకొచ్చారు



పట్నా : ప్రధాని నరేంద్రమోదీపై ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ ఓ కపటమైన వ్యక్తి అని పిలవకుండానే ఆయన పాకిస్థాన్ వెళ్లి అక్కడి కరడు గట్టిన ఐఎస్ఐ వారిని భారత్‌లోకి విహారయాత్ర (పిక్నిక్)కు తీసుకొచ్చారని మండిపడ్డారు. భారత్‌కు పఠాన్‌కోట్ అత్యంత ముఖ్యమైన మిలిటరీ స్థావరం అని అందులోకి ఐఎస్ఐకు చెందిన వారు పిక్నిక్‌కు వచ్చినట్లుగా వచ్చి వెళ్లారని, అందుకు కారణం మోదీనే అని ఆయన విరుచుకుపడ్డారు. పాకిస్థాన్‌తో కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కయిందని ప్రధాని మోదీ ఆరోపించిన నేపథ్యంలో స్పందించిన లాలూ తీవ్రంగా దుయ్యబట్టారు. నిజంగా మోదీకి పాకిస్థాన్ అంటే అసహ్యం ఉంటే ఎందుకు పాక్‌కు అత్యంత సానుకూల దేశం హోదా నుంచి తొలగించడం లేదని ప్రశ్నించారు. అసలు ఆహ్వానించకుండానే ప్రధాని మోదీ పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికి వెళ్లారని, అంతకుముందు తన ప్రమాణస్వీకార కార్యక్రమానికి కూడా ఆహ్వానించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీపై చేసిన తీవ్ర ఆరోపణ విషయంలో మోదీ, ఆయన పార్టీ బలంగా నిలబడదని నమ్ముతున్నానని అన్నారు.

## ట్రంప్‌పై లైంగిక ఆరోపణల నిగ్గుతేల్చాలి



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని 50 మందికి పైగా అమెరికన్ కాంగ్రెస్ మహిళా ప్రతినిధులు డిమాండ్ చేశారు. పాలనా సంస్కరణల సభా కమిటీ ఛైర్మన్, ర్యాంకింగ్ మెంబర్‌కు రాసిన లేఖపై మహిళా ప్రతినిధులు సంతకాలు చేశారు.అమెరికా అంతటా మి టూ క్యాంపెయిన్‌లో భాగంగా పెద్ద ఎత్తున మహిళలు తమపై జరిగిన లైంగిక వేధింపులు, దాడులను వివరిస్తూ ముందుకొస్తున్న క్రమంలో ట్రంప్ వ్యవహారాలపై దర్యాప్తును కోరుతున్నామని అమెరికన్ కాంగ్రెస్ మహిళా ప్రతినిధులు స్పష్టం చేశారు.

ట్రంప్ తమను లైంగికంగా వేధించాడని పలువురు మహిళలు చేస్తున్న ఆరోపణలపై అధ్యక్షుడు స్పందించాలని, తనను సమర్థించుకునేందుకు ఆయన తగిన ఆధారాలు సమర్పించాలని మహిళా సభ్యులు ఈ లేఖలో పేర్కొన్నారు. అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టకముందు ట్రంప్ తమను అసభ్యకరంగా తాకాడని, అభ్యంతరకరంగా ప్రవర్తించాడని గత రెండేళ్లుగా దాదాపు 16 మంది మహిళలు ఆరోపించిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడిపై తమ ఆరోపణలకు సంబంధించి యూఎస్ కాంగ్రెస్ విచారణ చేపట్టాలని ఆయనపై ఆరోపణలు గుప్పించిన ముగ్గురు మహిళలు ఇటీవల డిమాండ్ చేశారు.

మరోవైపు తనపై వెల్లువెత్తిన లైంగిక వేధింపుల ఆరోపణలను 71 ఏళ్ల ట్రంప్ తోసిపుచ్చారు.తానింతవరకూ ఎవరి ఇష్టానికి వ్యతిరేకంగా ఎవరినీ లైంగికంగా వేధించలేదని పేర్కొన్నారు. తనపై వచ్చిన ఆరోపణలపై అధ్యక్షుడు ఇప్పటికే వివరణ ఇచ్చారని, నిరాధార ఆరోపణలుగా కొట్టిపారవేశారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా శాండర్స్ స్పష్టం చేశారు.

## రాజేశ్ ను పట్టించిన మటన్ సూప్

హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నాగర్ కర్నూల్ సివిల్ కాంట్రాక్టర్ సుధాకర్ రెడ్డి హత్య కోణంలో కొత్త ట్విస్ట్ చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న రాజేశ్‌ను మటన్ సూప్ అడ్డంగా పట్టించింది.

కాగా యాసిడ్ దాడి గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్నది తమ కుమారుడు సుధాకర్ రెడ్డి కాదని మొదటి నుండే అతని కుటుంబసభ్యులు అనుమానిస్తూ వచ్చారు. అయితే వారి అనుమానానికి పక్క ఆధారాలు దొరికాయి. ఆస్పత్రిలో అతని మాటలు అనుమానం తెప్పించిన .. పక్కాగా మటన్ సూప్ పట్టించింది. మృతుడు సుధాకర్ రెడ్డి నాన్ వెజ్‌ను ఇష్టంగా తినేవాడు.

అయితే యాసిడ్ గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజేశ్ మాత్రం పూర్తి శాఖాహారి. అయితే కాలిన గాయాలతో ఉన్న వారికి మటన్ సూప్ అందించగా తాగేందుకు అతడు నిరాకరించాడు. మటన్ సూప్ తాగనని రాజేశ్ ఆస్పత్రి సిబ్బందికి చెప్పడంతో సుధాకర్ రెడ్డి కుటుంబీకులు షాక్ తిన్నారు.

తమ అనుమానాలకు మటన్ సూప్ తోడు కావడంతో.. గాయాలతో ఉన్నది సుధాకర్ కాదని నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు.. నాగర్ కర్నూలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు తమదైన శైలిలో విచారణ జరపడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. కేసు విచారణలో భాగంగా స్వాతి ప్రియుడు రాజేశ్ ఆధార్ కార్డు వేలిముద్రలతో దొరికిపోయాడు.

## సంక్షోభంలో చైనా-పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్

ఇస్లామాబాద్ : చైనా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న చైనా-పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్ నిర్మాణ పనులను తాత్కాలికం?గా నిలిపేస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. ప్రధానంగా సీపీఈసీ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న మూడు హైవేలకు అవినీతి సాకుతో చైనా నిధులు నిలిపివేయడంతో పాకిస్తాన్ ఈ చర్యకు దిగినట్లు తెలుస్తోంది. చైనా తిరిగి నిధులను పునరుద్దరిస్తేనే.. పనులు మొదలు పెడతామంటూ పాకిస్తాన్ ప్రకటించింది. ఇదే విషయాన్ని 22 మంది సభ్యులు కలిగిన పాకిస్తాన? పార్లమెంటరీ కమిటీ స్పష్టం చేసింది.

పాకిస్తాన్ అభివృద్ధి మంత్రి ఆషాన్ ఇక్బాల్ కూడా నిధుల విడుదల తరువాతే పనులు మొదలవుతాయని అన్నారు. చైనా నిధులు విడుదల చేస్తేనే సీపీఈసీ ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన మూడు హైవేల నిర్మాణం పనులు మొదలు పెడతామని ఆయన స్పష్టం చేశారు.

చైనా-పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్ గురించి పాకిస్తాన్ పార్లమెంటరీ కమిటీ సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఈ ప్రకటనలో మూడు హైవే ప్రాజెక్టులను రద్దు చేయలేదని...

నిధుల కొరత వల్ల నిలిపినట్లు తెలిపింది. ఇదిలా ఉండగా... చైనా -పాకిస్తాన్ ఎకనమిరక్ కారిడార్ ఆర్థిక అవకతవకల వల్ల పూర్తిగా నిలిచిపోయిందనే వార్తలు అంతర్జాతీయ స్థాయిలో వినిపిస్తున్నాయి. సీపీఈసీ ప్రాజెక్ట్ మొదలయిన తరువాత ఇరుదేశాల మధ్య పలు సందరాల్లో వివాదాలు చెలరేగాయి. ప్రధానంగా దీమార్ డ్యామ? విషయంలో చైనా అభ్యంతరాలు వ్యక్తం చసింది. అదే సమయంలో.. పాకిస్తాన్ కూడా గ్వాదర్ పోర్టులో చైనా కరెన్సీ యువాన్‌ను అంగీకరించేది లేదంటూ ప్రకటించింది.

## సమకవి సమయం

### విజయ రహస్యం

కాలం, ఖర్మం కలిసి రాలేదంటూ
జాతక చక్రం అనుకూలంగా లేదంటూ
జీవితంలో ప్రగతి సాధించలేకపోవుటకు
నెపాన్ని ఇతరులపై నెట్టేసి
నిమ్మకు నీరెత్తినట్లు హాయిగా
కూర్చునే వారు అధమాధములు
విజయం సాధించుటకు
తగిన మూల రహస్యం, సూత్రం
తమలోనే వున్నదని గ్రహించి
పట్టుదల, దీక్ష తపనలతో
క్రమబద్ధమైన ప్రణాళికతో
ధైర్యే సాహసే లక్ష్మీ అంటూ
ముందుకు సాగిన వారు ఉత్తములు
అనితర సాధ్యమైన విజయాలు వారికే స్వంతం

కవిత రచన :
సి . ప్రతాప్
సెల్ నెం: 90636 22665

## పంచాంగం

మాసం : మార్గశిర; తిథి : ఏకాదశి తె.5.05;
చిత్త రా.11.29; ఉ.వ. 7.03 ల 8.41

బుధవారం
13-12-2017

**మేషం :** ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు.

**వృషభం :** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానికల్, కంప్యూటర్ రంగాల వారికి ఆశాజనకం. ఇతరులకు వాహనం ఇవ్వడంవల్ల ఇబ్బందులను ఎదుర్కుంటారు. వృత్తి, వ్యాపారా లలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. ఉద్యోగరీత్యా దూర ప్రయాణాలు చేయ వలసివస్తుంది.

**మిథునం :** స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

**కర్కాటకం :** స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధికమవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అనుకూలిస్తాయి.

**సింహం :** ప్రతి చిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మంచిది కాదు. ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్యరంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమ యంలో ఏకాగ్రత అవసరం. స్త్రీలకు పనివారలతో సమస్యలు తలెత్తినా నెమ్మదిగా సమసిపోతాయి.

**కన్య :** స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

**తుల :** ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. బ్యాంకు రుణాలు తీర్చడంతో పాటు కొంత రుణం తీసుకుంటారు. బంధువుల మధ్య సయోధ్య లోపిస్తుంది.

**వృశ్చికం :** కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

**ధనుస్సు :** ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

**మకరం :** ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సానుకూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి.

**కుంభం :** ఉద్యోగస్తులు, రాజకీయనాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది.

**మీనం :** స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. దీర్ఘకాలికంగా ఆగిపోయిన ధనం చేతికి వస్తుంది. లక్ష్య సాధనపై దృష్టి పెట్టడానికి సరైన సమయం.

## సంపదలను ప్రసాదించే శివుడు

సంకీర్తన



జీవితాన్ని ఆర్థిక పరిస్థితి ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అన్ని ఆనందాలు .. సంతోషాలు ఆర్థిక పరిస్థితితో ముడిపడి లేకపోయినా, అది చూపించే ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అవసరాలు .. ఆపదల బారినుంచి బయటపడటానికి ఆర్థిక పరిస్థితి బాగా ఉండవలసిందే.

అలాంటి పరిస్థితుల్లో ఆయురారోగ్యాలతో పాటు ప్రతి ఒక్కరూ సంపద లను కూడా భగవంతుడిని కోరు తుంటారు.

ఇలా సంపదలను పొందాలనుకున్నవాళ్లు, పరమ శివుడిని పూజించడం వలన ఫలితం ఉం టుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. సోమవారం పరమ శివుడికిఅత్యంత ప్రీతికరమైన రోజు. ఈ రోజున స్వామివారిని మారేడు దళాలతోను .. శంఖు పుష్పాలతోను పూజించడం వలన, సంపదలు చేకూరు తాయని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. అందువలన ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి బయట పడాలనుకునేవాళ్లు, సదాశివుడిని ఈ రీతిగా పూజించి ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు.

### ఆపదలు తొలగించే అమ్మవారు

శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఏ రూపంలో వున్నా .. ఏ పేరుతో కొలవబడుతూ వున్నా అమ్మ ప్రేమతో అనుగ్రహిస్తూనే ఉంటుంది. అందువల్లనే అమ్మవారి ఆలయాలు ఎక్కడ వున్నా భక్తులతో నిత్యం సందడిగా కనిపిస్తూనే ఉంటాయి.

అమ్మవారిని పూజించడం వలన సౌభాగ్యం నిలుస్తుందని ..

సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

ఇక అమ్మవారు ఆవిర్భవించిన 'అష్టమి' తిథి రోజున ఆ తల్లిని పూజించడం మరింత మంచి దని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి.

అష్టమి రోజున అమ్మవారిని పూజించడం వలన .. పారాయణం చేయడం వలన ..

ఆ రోజున 8 రకాల వంటకాలు నైవేద్యంగా సమ ర్పించడం వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయి. ముఖ్యంగా అనారోగ్యాలు ..

ఆపదలు దరిచేరవు. జీవితాన్ని అనారోగ్యాలు ..

ఆపదలు అతలా కుతలం చేస్తుంటాయి. అందు వలన...

అలాంటి గండాల బారిన పడకుండా అష్టమి రోజున అమ్మవారిని ఆరాధిస్తూ ఉండాలి.



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# విశాఖ ఉక్కు కార్మికుల సమాచార మిషన్ ప్రారంభం



గాజువాక: విశాఖ ఉక్కుకర్మాగారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(వర్క్స్) కార్యాలయ ఆవరణలో ఉక్కు కార్మికుల సమాచార మిషన్‌ను సంస్థ సి.యం.డి పి.మధుసూధన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు సంబందించిన పూర్తి సమాచారాం, పే సర్వీసెస్, మెడికల్ హిస్టరీ, కంప్లైంట్స్, ఆన్‌లైన్ అప్లికేషన్స్, సి.యం.డి ఆన్ లైన్ తదితర ముఖ్యమైన సమాచారాన్ని ఈ మిషన్ ద్వారా తెలుసుకునే సౌకర్యం కలదని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (పర్సనల్) కె.సి.దాస్, డైరెక్టర్(ఆపరేషన్) పి.కె.రథ్, ఇ.డి(పి.అండ్ ఐఆర్) దేబాషిన్‌రాయ్, సీనియర్ ఉక్కు అధికారులు, గుర్తింపు యూనియన్ ప్రతినిధులు గంధం వెంకటరావు, సిఐటియు నాయకులు ఎన్.రామారావు, ఎఐటియుసి నాయకులు నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రతా ప్రమాణాలు పాటించని గనుల్ని మూసివేయిస్తాం

## - ప్రాణాలు కాపాడతాం

బంకురువలస గని ప్రమాదంపై విచారణ జరిపిస్తాం, గని తాత్కాలికంగా మూసివేస్తాం

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం : మంత్రి ఆర్.వి.సుజయ్‌కృష్ణ రంగారావు



విజయనగరం : రాష్ట్రంలోని గనుల్లో భద్రతా ప్రమాణాలపై సమీక్షిస్తామని, నిర్ణీత భద్రతా ప్రమాణాలు పాటించని గనుల్ని మూసివేయిస్తామని రాష్ట్ర గనుల శాఖ మంత్రి ఆర్.వి.సుజయ్ కృష్ణ రంగరావు చెప్పారు. ఈనెల 14న రాష్ట్రస్థాయి గనుల భద్రత కమిటీ సమావేశాన్ని నిర్వహించి గనుల్లో భద్రతపై సమీక్షిస్తామన్నారు. భద్రత ప్రమాణాలను పాటించని సంస్థలపై చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చిస్తామన్నారు. గనుల్లో పనిచేసే కార్మికుల ప్రాణాలు కాపాడటమే తమ లక్ష్యమని చెప్పారు. బొబ్బిలి మండలం బంకురువలసలో నిర్వహిస్తున్న మాంగనీస్ గనిలో ఇద్దరు కార్మికులు ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన ఘటనపై మంత్రి తక్షణం స్పందించి మంగళవారం మధ్యాహ్నం ఘటనా స్థలాన్ని జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్‌తో కలసి పరిశీలించారు. ఘటనపై వివరాలను బాధిత కుటుంబాలు, గనిలో పనిచేస్తున్న కార్మికులు, పోలీసు, రెవిన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఘటనలో మృ తిచెందిన కార్మికులు ఎం.వెంకటి, అఛ్చెయ్య మృతదేహాలను పరిశీలించి, వారి కుటుంబాలను పరామర్శించారు. యీ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ యీ ఘటన జరగడం, ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రాంతంలో మాంగనీస్ మైనింగ్ నిర్వహిస్తున్న సర్వాగీ సంస్థ తగిన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నదీ లేనిదీ నిర్ధారించేందుకు ఈ ఘటనపై విచారణ జరిపిస్తామన్నారు. విచారణ పూర్తయ్యేంత వరకు ఈ సంస్థ ఆధ్వర్యంలో మైనింగ్ నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

గతంలో కూడా యీ గనిలో తవ్వకాల సందర్భంగా పలు సంఘటనలు జరిగినట్లు తెలుస్తున్న ద ృష్ట్యా తగిన భద్రతా ప్రమాణాలు పాటించలేదని విచారణలో తేలినట్లయితే యీ సంస్థ ఆధ్వర్యంలో మైనింగ్‌కు అనుమతిచ్చే అవకాశం వుండదని స్పష్టంచేశారు. ఈ ఘటనలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. చంద్రన్న బీమా పథకం కింద వారికి పరిహారం ఇప్పించడంతోపాటు కార్మిక చట్టం కింద యాజమాన్యం ద్వారా కూడా పరిహారం ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ పర్యటనలో పార్వతీపురం ఆర్.డి.ఓ. బి.సుదర్శన దొర, డి.ఎస్.పి. పి.సౌమ్యలత తదితరులు పాల్గొన్నారు.



# నూకాంబిక అమ్మవారి దర్శించుకున్న మాజీ సర్పంచ్ సుంకర చంటి



అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారిని సీతానగరం మాజీ సర్పంచ్ సుంకర చంటి, కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. అలాగే సర్వేయర్ పీలా సంతోష్ దంపతులు నూకాంబిక అమ్మవారిని దర్సించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు.

# రెవెన్యూ కోర్టుల పునరుద్ధరణకు ఏర్పాట్లు

కొయ్యూరుః రెవెన్యూ, భూసంబంధిత సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ కోర్టులు అవసరమని సబ్ కలెక్టర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా వీటి పునరుద్దరణకు చర్యలు చేపడుతున్నారు. కొయ్యూరు రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నుంచి రెవెన్యూ కోర్టు నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. మండల స్థాయిలోనే రెవెన్యూ సమస్యలు పరిష్కారమయ్యేలా గతంలో ప్రతీ శుక్రవారం ఈ కోర్టులు నిర్వహించేవారు. అనివార్య కారణాలతో వీటి నిర్వహణ గతంలో పని చేసిన సబ్ కలెక్టర్లు నిలిపివేశారు. ప్రస్తుత సబ్ కలెక్టర్ వీటి ప్రాధాన్యతను గుర్తించి తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈ నెల 15న కొయ్యూరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ కోర్టు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు స్థానిక సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి నిర్వహించే ఈ కోర్టులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి కోరారు.

## 14న మండల సమావేశం

నాతవరంః ఈ నెల 14న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. సంబంధిత మండలశాఖ అధికారులు దిగువ స్థాయి సిబ్బందిని పంపించకుండా తగిన సమాచారంతో హాజరు కావాలని కోరారు. ఏడాదిలో చివరి సమావేశం కావడంతో అభివృద్ధి పనులపై కీలకమైన చర్చ ఉంటుందని చెప్పారు.

# సిపిఎస్ బాధితుల 2 లక్షల మంది ఏకమవుతాం

## మా డబ్బు ప్రభుత్వం వ్యాపారమా..?

## ఓట్ల కోసమే వృద్ధాప్య పింఛన్లా..?

నర్సీపట్నంః సిపిఎస్ బాధిత ఉద్యోగులంతా రాష్ట్ర వ్యాప్తంగా ఏఎఎస్ మొదలుకొని అటెండర్ వరకూ 2లక్షల మంది ఏకం కానున్నామని ఉద్యోగుల సంఘం నాయకులు తెలిపారు. ఈ నెల 16న విజయవాడలో పెన్షన్ సాధన సమితిగా కత్త కార్యవర్గం ఎన్నిక కానుంది. ఇప్పటికీ మూడు రాష్ట్రాల్లో పాత పింఛను ఇస్తామని ప్రకటించంతో వీరి పోరాటానికి మరింత బలం చేకూరింది. 2004లో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రతిపాదించగా యుపిఎ ప్రభ్వుం ఆమోదం తెలిపింది. ఫలితంగా ఉద్యోగుల జీతాల్లో నుండి 10శాతం దాచి సదరు డబ్బుతో ప్రభుత్వం షేర్ మార్కెట్లో వ్యాపారం చేస్తుందని ఉద్యోగులంతా ఎర్రెత్తిపోతున్నారు. కనీసం ఉద్యోగి చనిపోతే కాంట్రాక్టు ఉద్యోగి కంటే దారుణమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలా జిల్లాలో ఇద్దరు ఉద్యోగులు చనిపోతే కుటుంబం దిక్కుమాలిపోయింది. ప్రభుత్వం సమాధానం చెప్పాలని వీరు నిలదీస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులంటే కాంట్రాక్ట్ ఉద్యోగి కంటే హీనంగా ఉంది. చనిపోతే కారుణ్య నియామకం లేదు. 10శాతం డబ్బుకి గ్యారంటీ లేదు. 60 సంవత్సరాల తర్వాత పింఛన్లు ఇస్తున్నారు. 30 సంవత్సరాల ప్రభుత్వానికి సేవ చేసి రిటైరై ఎలా బతకాలో ప్రభుత్వం ఆలోచించాలి.

# ఆర్టీసి సంస్థ పరిరక్షణను కార్మిక హక్కులను కాపాడుతాం

నర్సీపట్నంః రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ పిలుపుమేరకు స్థానిక ఆర్టీసి డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. కాలం చెల్లిన బస్సులు, ఔట్‌సోర్సింగ్, యూనిఫాం మహిళా కండక్టర్ల డ్యూటీలు, కాలం చెల్లిన టిమ్‌లు విషయంలో గుర్తింపు యూనియన్ మౌనాన్ని ఎండగట్టారు. యాజమాన్యంతో కుమ్మక్కై కార్మిక హక్కులను కాలం రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థను రక్షించేందుకు గతంలో ఇయు పాటుపడిందన్నారు. ధర్నాలో ఏఐటియుసి ఆర్టీసి గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.రజాక్, డిపో కార్యదర్శి వివి.రావు, కోశాధికారి ఎస్‌కె.కుమార్, ఆర్టీసి ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇన్‌చార్జి డిప్యూటీ డిఇఒ సునీత బాధ్యతలు

యలమంచిలి రూరల్ః ఇన్‌చార్జి డిప్యూటి డిఇఒగా ఎం.సునీత బాధ్యతలు స్వీకరించారు. పరవాడ మండల విద్యాశాఖ అధికారి పని చేస్తున్న సునీతకు ఉన్నతాధికారులు అదనంగా ఈ బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు మండలంలోని ప్రభుత్వం ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులు, సంఘాల నేతలు వనుం నాగేశ్వరరావు ఆమెను కలిసి అభినందనలు తెలిపారు. గత ఏడాది కంటే ఉత్తీర్ణత శాతం పెంపునకు కృషి చేస్తానని ఈ సందర్భంగా సునీత చెప్పారు. ఇందుకోసం అందరూ సహకరించాలని కోరారు.

# శిష్టకరణంలను ఓబిసిలో చేర్చాలి



గాజువాక: శిష్టకరణంల సామాజికవర్గాన్ని ఓబిసిలో చేర్చాలని అగనంపూడి లంకెలపాలెం శిష్టకరణంల సంఘం అధ్యక్షులు మంత్రి త్రినాధరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మంగళవారం లంకెలపాలెం మరిడిమాంభగుడి వద్ద అగనంపూడి, లంకెలపాలెం పరిసరప్రాంత శిష్టకరణ బంధు మిత్రులకు వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్దలకు, పిల్లలకు వివిధ విభాగాలలో పోటీలను నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేసారు. ఈ సందర్భంగా మంత్రి త్రినాధరావు మాట్లాడుతూ వనమహోత్సవానికి విచ్చేసిన శిష్టకరణ సభ్యులకు, కుటుంబాలకు కృతజ్ఞతలను తెలిపారు. శిష్టకరణంలను ఓబిసి చేర్చేవిధంగా ప్రభుత్వంపై పోరాటం చేసైన సాధించుకోవాలని పిలుపు నిచ్చారు.

ఉన్నత శిష్టకరణవర్గాలు పేద కుటుంబాలను ఆదుకోవాలని సూచించారు. అనంతరం ప్రముఖులు బలివాడ మహేశ్వరరావు, మంత్రి జగన్నాధరావు, జగ్గమంత్రికృష్ణ, దుగ్గివలస దివాకర్(సినీ డైరెక్టర్) లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.వి.యన్ మూర్తి, బి.వి.ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్.ఎన్.మూర్తి, బి.మహేష్, జె.గోపి, సత్యన్నారాయణ, జి.రాంబాబు, గాజువాక శిష్టకరణంల సంఘం సభ్యులు డబ్బీరు నారాయణరావు, రమణారావు, కూర్మన్నపాలెం, అనకాపల్లి సంఘం సభ్యులు సత్యారావు, గోపి,బాస్కరరావు,గోపినాధరావు, ఉక్కు నగరసంఘం సభ్యులు గోపాలకృష్ణ, రాజేశ్వరరావు, శిష్ణకరణం కుటుంబాలు తదితరులు పాల్గొన్నారు.

# యారాడ బస్సు ప్రమాదానికి కారణం

## యారాడ ప్రమాదంపై రవాణాశాఖ అధికారులు



గాజువాక: గత శనివారం యారాడ కొండపై ప్రవేటు పాఠశాలకు సంబందించిన బస్సులు ఒకదానిని ఒకటి డీ కొన్నసంఘటనలో జరిగిన ప్రమాదానికి డ్రైవర్ అవగాహనలోపము, నిర్లక్ష్యంమే కారణమని రావాణాశాఖ అధికారులు నిర్ధారించారు. బ్రేకులు ఫెయిల్ అవడం కాదని, డ్రైవర్ అవగాహన లోపమేనని విచారణలో తెలినట్లు అధికారులు తెలిపారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన ఒక ప్రవేటు పాఠశాల విద్యార్ధులు నాలుగు బస్సులలో యారాడతీరానికి విహార యాత్రకు వెళ్ళి, తిరుగు ప్రయాణంలో యారాడ రహదారి వద్ద ఒకదానినొకటి బస్సులు ఢీకొనడంతో జరిగిన ప్రమాద సంఘటన తెలిసిందే. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు 70 విద్యార్ధులు ప్రమాదానికి లోనై, తీవ్రగాయాలపాలయ్యారు. ఇందులో 8మంది కేర్ ఆసుపత్రిలో చికిత్సపొందగా, డ్రైవర్‌తో పాటు 11మంది విద్యార్ధులు కెజిహచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం మొదట బ్రేకుల ఫెయిల్ అవడం వలనే జరిగిందని అందరూ భావించారు. అయితే విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం మంగళవారం రవాణాశాఖ అధికారి వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ సంఘటన జరిగిన గంటలో వెళ్ళి పరిశీలించామని, విచారణలో బ్రేకులు ఫెయిల్ అవలేదని, కేవలం డ్రైవర్ బస్సుకు బస్సుకు మద్యదూరాన్ని మెయింటెన్ చేయకపోవడం వలన ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఎగువ ప్రాంతంనుంచి దిగుతున్నప్పుడు బస్సును కండిషన్‌లో ఉంచుకోకుండా గేర్‌లు మార్చినప్పుడు అటోమెటిక్‌గా న్యూట్రల్ అయిపోయి బండి అదుపు తప్పుతుందని అన్నారు. అయితే అనుభజ్ఞులైన డ్రైవర్స్‌కు మాత్రమే ఈ విషయాలు తెలుస్తాయని అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పాఠశాల యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే బస్సులను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని సూచించారు. అనుభజ్ఞులైన డ్రైవర్లతోనే బస్సులను నడిపించాలని సూచించారు. ఈ సంఘటనలో యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

2018 డైరీలు, క్యాలెండర్లు హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ & బుక్ సెంటర్
పూర్ణామార్కెట్ కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338, 2561749, 2781865

# బిఎస్ఎన్ఎల్ కార్మికులు ఆందోళన

నర్సీపట్నంః బిఎస్ఎన్ఎల్ సబ్సిడియరి టవర్ కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, కార్మికులు మంగళవారం బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 1.1.2017 నుండి 15శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలన్నారు. అలవెన్సులు రివైజ్ చేయాలన్నారు.

2వ పిఆర్‌సిలో వదిలి వేయబడిన సమస్యలు పరిష్కరించాలన్నారు.

సంస్థ నష్టాలలో ఉంచే వేతన సవరణ జరుపరాదని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి కెవి.రమణ, యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్.అప్పారావు, అధ్యక్షులు ఎం.అప్పలనాయుడు, ఎస్ఎన్ఇఎ తరపున ఎస్‌డిఒటి రామకృష్ణ, ఎఫ్ఎన్‌టిఒ డిఎస్ కె.రాంబాబు, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, తదితర కార్మికులు పాల్గొన్నారు.



మార్గశిర మాసోత్సవాలలో భాగంగా మంగళవారం ఉత్తరాంధ్ర ఇలవేల్పయిన శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ కుటుంబ సభ్యులు.

ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజ నిర్వహింపజేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# చిత్రభాను

## అనుష్క- విరాట్ పెళ్లి ఫోటోలు అమ్ముకున్నారు, ఎందుకంటే?



బాలీవుడ్ బ్యూటీ అనుష్క శర్మ, టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి వివాహం డిసెంబర్ 11న ఇటలీలోని టుస్కానీ ప్రాంతంలో సంగతి తెలిసిందే. ఈ వేడుకకు కుటుంబ సభ్యులు, అతికొద్ది మంది అథితులు మాత్రమే హాజరయ్యారు. 'అనుష్క-విరాట్' పెళ్ళి వీడియో ! తమ పెళ్లి గురించి ముందుగా ఎలాంటి ప్రకటన చేయకుండా గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిపించిన విరుష్క.... పెళ్లి జరిగిన తర్వాత అఫీషియల్‌గా ఈ విషయాన్ని వెల్లడించడంతో పాటు కొన్ని ఫోటోలు పోస్టు చేశారు. పెళ్లి వేడుకకు ముందు నిశ్చితార్థం, మెహందీ, సంగీత్ కార్యక్రమాలు కూడా ఇటలీలోనే జరిగాయి. అయితే ఈ వేడుకలకు సంబంధించిన ఫోటోలు ఏవీ కూడా బయటకు రాలేదు. ఇవన్నీ ఓ ఫ్యాషన్ మేగజైన్‌కు అమ్మినట్లు తెలుస్తోంది. ఆ డబ్బుతో ఏం చేస్తారు? ఈ ఫొటోలు అమ్మడం ద్వారా వచ్చిన డబ్బును ఛారిటీ కార్యక్రమాలకు విరాళంగా ఇవ్వాలని అనుష్క, విరాట్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అందుకే వివాహ వేడుకకు సంబంధించిన కొన్ని ఫోటోలు తప్ప ఇతర ఫోటోలు బయటకు రానివ్వలేదని టాక్. ఎంత మొత్తానికి అమ్మారు? అయితే ఈ ఫోటోలను ఎంత మొత్తానికి అమ్మారు అనే విషయం బయటకు రాలేదు. హీరోయిన్ అనుష్క, క్రికెటర్ విరాట్



కోహ్లికి ఉన్న ఇమేజ్ ఆధారంగా ఈ ఫోటోలను భారీ ధరకు అమెరికా కేంద్రంగా నడిచే ఓ ఇంటర్నేషనల్ ఫ్యాషన్ మేగజన్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. రెండు చోట్ల భారీగా వివాహ విందు పెళ్లి వేడుకకు కొద్ది మందిని మాత్రమే ఆహ్వానించిన నేపథ్యంలో డిసెంబర్ 21న ఢిల్లీలో, డిసెంబర్ 26న ముంబయిలో వెడ్డింగ్ రిసెప్షన్ ప్లాన్ చేశారు. పెళ్లి తర్వాత ఇద్దరూ ముంబైలో నివాసం ఉంటారని తెలుస్తోంది.



## భలే ఛాన్సులే..!

రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ భారీ మల్టీస్టారర్ చిత్రంలో నటించబోతున్నారని వార్తలొస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయని పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ చిత్రంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ బాక్సర్స్ పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో అను ఇమ్మాన్యుయెల్ కథానాయికగా నటించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ అమ్మడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతున్నది. అనతికాలంలోనే యువతలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. మజ్నూ చిత్రంతో తెలుగుతెరకు పరిచయమై ఈ సుందరి ప్రస్తుతం పవన్‌కల్యాణ్ సరసన అజ్ఞాతవాసి చిత్రంలో, అల్లు అర్జున్‌తో కలిసి నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా చిత్రంలో నటిస్తున్నది. నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న శైలజారెడ్డి అల్లుడు చిత్రంలో కూడా ఆమే కథానాయిక. అరంగేట్రం చేసిన తక్కువ సమయంలోనే రాజమౌళి చిత్రంలో అవకాశం దక్కించుకోవడం విశేషమని చెప్పుకుంటున్నారు. రాజమౌళి, ఎన్టీఆర్, రామ్‌చరణ్ కలయికలో రానున్న ప్రతిష్టాత్మక చిత్రం వచ్చే ఏడాది ద్వితీయార్థంలో సెట్స్‌మీదకు వెళ్తుందని సమాచారం.

## డాడీ ఎవరినీ విడిచిపెట్టొద్దు.. లవ్ యూ డాడీ..

సినీ నటుడు విజయ్ సాయి ఆత్మహత్య కేసు అనేక మలుపులు తిరుగుతున్నది. తొలుత సినీ అవకాశాలు లేకపోవడం, ఆర్థికంగా ఇబ్బందులకు లోనవ్వడమే ఆయన సూసైడ్ కారణమని అంతా భావించారు. కానీ భార్య, మరికొందరి వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకొన్నట్టు సెల్ఫీ వీడియో ద్వారా వెల్లడి కావడంతో ఈ కేసు మరింత వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు ముందు విజయ్‌సాయి సెల్‌ఫోన్‌లో తీసుకున్న సెల్ఫీ వీడియోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ యూసఫ్‌గూడలోని తన నివాసంలో సోమవారం విజయ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. విజయ్ ఆత్మహత్య ఘటనపై సినీ నటులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. పలువురు నటులు విజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించి తమతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అసలు జరిగిందేమిటీ? రెండేళ్లుగా విజయ్ ఆయన భార్య వనిత అలియాస్ వరలక్ష్మి అలియాస్ విన్నితో గొడవలు జరుగుతున్నాయి. విడివిడిగా జీవిస్తున్న వీరి విడాకుల కేసు న్యాయస్థానం పరిధిలో ఉంది. వీరి కుమార్తె కుందన కోర్టు ఆదేశాల మేరకు నిర్ణీత సమయం తండ్రితో ఉంటున్నది. సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో విజయ్‌ను కలవడానికి ఆయన స్నేహితుడు సాయి వచ్చారు. ఈ నేపథ్యంలో వరలక్ష్మమ్మ అల్పాహారం సిద్ధం చేస్తుండగా.. స్నానం చేసి వస్తానంటూ విజయ్ బెడ్‌రూంలోకి వెళ్లాడు. బాత్రూంలోకి వెళ్లి రాకపోయే.. విజయ్ బాత్రూంలోకి వెళ్లి దాదాపు గంట కావస్తున్నా అతడు బయటకు రాకపోవడంతో స్నేహితుడు సాయితో పాటు తల్లి బెడ్‌రూమ్ వద్దకు వెళ్లి పలుమార్లు విజయ్‌ని పిలిచారు. ఎలాంటి స్పందనా లేకపోవడంతో తలుపులు పగలగొట్టి లోపలకు ప్రవేశించగా.. ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్న స్థితిలో విజయ్ కనిపించారు. వెంటనే కిందకు దింపి చూడగా అప్పటికే విజయ్ మరణించినట్లు గుర్తించారు. విజయ్ సెల్ఫీ వీడియోలో పరువు, మానసిక వేదనతోనే ఆత్మహత్య చేసుకున్నట్టు విజయ్ వీడియోలో పేర్కొన్నట్టు తెలుస్తున్నది. భార్య వనిత ప్రవర్తన, ఇతరుల వేధింపుల కారణంగానే తాను ఈ నిర్ణయం తీసుకున్నాను. నా చావుకు భార్య వనిత, వరలక్ష్మి, విన్నీ, బృందతోపాటు పారిశ్రామికవేత్త శశిధర్, న్యాయవాది శ్రీనివాస్ కారణం. వీరంతా తనను మానసికంగా హింసించారు అని వీడియోలో విజయ్ పేర్కొన్నట్టు సమాచారం. వనితను వదులొద్దు వనితకు గతంలోనే అమ్మిరెడ్డి అనే వ్యక్తితో పెళ్ళైందిజ ఆమెతో పాటు ఆమె తల్లి సైతం వ్యభిచారం చేసే వారు. ఈ విషయం వారి సొంతూరు వెళ్లినప్పుడు తెలిసింది. ఇలాంటి వారి వల్ల సమాజం చాలా ఇబ్బంది పడుతుందని, వనిత లాంటి వారిని వదలొద్దు అని విజయ్ వీడియోలో పేర్కొన్నారు. కూతురికి దూరంగా పెడుతున్నారు.. భార్య వనిత తన కూతురిని కూడా చూడనివ్వడం లేదు. తనకు సంబంధించిన కొన్ని వీడియోలు ఉన్నాయి. అవి బయటపెడుతానని బెదిరించిన అడ్వొకేట్ శ్రీను రూ.3 కోట్లు డిమాండ్ చేశారు. వీరంతా తనను తీవ్రస్థాయిలో మానసికంగా హింసించారు అని విజయ్ వెల్లడించినట్టు సమాచారం. ఎవరినీ విడిచిపెట్టొద్దు డాడీ.. ఈ వ్యవహారంలో ఎవరినీ విడిచిపెట్టొదు. అందరికీ శిక్ష పడేలా చూడు.. లవ్ యూ డాడీ.. నా కూతురు అలాంటి వాతావరణంలో పెరగడం నాకు ఇష్టంలేదు. చనిపోవడం కష్టంగా ఉన్నప్పటికీ తప్పట్లేదు. నా కూతురిని అక్కడ నుంచి తీసుకొని రండి డాడీ' అని విజయ్ సాయి సెల్ఫీ వీడియోలో వెల్లడించినట్టు తెలుస్తున్నది. ఎందుకు ఆత్మహత్య.. తన భర్త విజయ్‌సాయికి ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో తనకు తెలియదు. విజయ్‌కి వేరే మహిళతో సంబంధం ఉంది. నేను కళ్లతో ప్రత్యక్షంగా చూశాను. అప్పటి నుంచే మా మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని ఆయన తల్లిదండ్రులు దృష్టికి తీసుకెళ్లిన




పట్టించుకోలేదు. రెండేళ్లుగా కోర్టులో విడాకుల కేసు నడుస్తోంది. సూసైడ్ చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందో నాకు తెలియదు అని భార్య వనిత మీడియాకు తెలిపారు. కూతురి విషయంలో జోక్యం చేసుకోలేదు.. కూతురు విషయంలో కూడా నేను ఎలాంటి జోక్యం చేసుకోలేదు. సమయం చిక్కినప్పుడల్లా కూతురిని తీసుకెళ్లి మళ్లీ తీసుకొస్తుండేవారు. అయితే పెళ్లి సమయంలో ఇచ్చిన కట్న కానుకలు ఇవ్వమని కోరాను. పాప భవిష్యత్‌ను కూడా నేను చూసుకోవాలి కదా అని వనిత వెల్లడించారు.

## ఓరుగల్లుకు మిడిల్‌క్లాస్ అబ్బాయి





నాని, సాయిపల్లవి జంటగా నటిస్తున్న తాజా చిత్రం ఎంసీఏ. శ్రీరామ్ వేణు దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్, లక్ష్మణ్ నిర్మిస్తున్నారు. ఈ నెల 21న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలకానుంది. ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుకను ఈ నెల 16న వరంగల్‌లో నిర్వహించబోతున్నారు.

ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ ఈ ఏడాది ఆరంభంలో మా సంస్థలో నాని నటించిన నేను లోకల్ పెద్ద విజయం సాధించింది. ఎంసీఏతో మరో హిట్ కొట్టబోతున్నాం. నేడు థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేస్తున్నాం. స్వఛ్ఛమైన ప్రేమకు అందమైన ద ృశ్యరూపంలా సాగే చిత్రమిది.

నిర్మాణానంతర కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. దేవిశ్రీప్రసాద్ అద్భుతమైన సంగీతాన్నందించాడు. ఇటీవల విడుదలైన పాటలు శ్రోతల్ని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వరంగల్ ప్రజలు, అభిమానుల సమక్షంలో ఆడియో వేడుకను వైభవంగా నిర్వహించబోతున్నాం అన్నారు.

## చురకత్తులు దూసి.. పవన్ గుండెకు గాయం.. అజ్ఞాతవాసి మరో పాట రిలీజ్..



గాలి వాలుగా.. అజ్ఞాతవాసి మరో పాట రిలీజ్..! అజ్ఞాతవాసి సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. చిత్రానికి అనిరుధ్ అందిస్తున్న సంగీతం స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. ఈ చిత్రానికి సంబంధించిన రెండో సింగిల్ డిసెంబర్ 12న (మంగళవారం) రిలీజ్ చేశారు. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడిన గాలి వాలుగా ఓ గులాబి.. గాయమైంది గుండెకు తగిలి అంటూ వచ్చే పాటను ఆదిత్య మ్యూజిక్ రిలీజ్ చేసింది. చురకత్తులు దూసి తపన పెంతుంటావే అంటూ రాసిన సాహిత్యం ఆకట్టుకొనే విధంగా ఉన్నాయి. పవన్ ఫైట్స్ స్వీక్వెన్స్ ఇక ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం ఇంటర్నెట్‌లో విస్తృతంగా ప్రచారం అవుతున్నది. అజ్ఞాతవాసి చిత్రంలో అభిమానులకు పిచ్చెక్కించే విధంగా ఫైట్స్ సీక్వెన్స్‌ను రూపొందించినట్టు తెలుస్తున్నది. ఏకంగా ఈ చిత్రంలో ఏడు ఫైట్ సీక్వెన్స్‌ను డిజైన్ చేసినట్టు సమాచారం. భారీగా యాక్షన్ సీన్లు త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన



అతడు చిత్రంలో ఫైట్స్ ఇప్పటికీ ఫ్యాన్స్‌ను ఉత్సాహంలో ముంచెత్తాయి. అతడు సినిమాకు మించిన ఫైట్స్‌ను ఈ చిత్రంలో కంపోజ్ చేసినట్టు తెలుస్తున్నది. మూడు యాక్షన్ సీన్లకైతే భారీగా ఖర్చు పెట్టినట్టు సమాచారం. ఈ ఫైట్స్‌ను రోమాలు నిక్కబొడిచే విధంగా రూపొందించినట్టు సినీవర్గాల్లో ప్రచారం అవుతున్నది. ఫస్ట్‌లుక్‌కు అనూహ్య స్పందన ఇప్పుడు ఆ చిత్రాల రికార్డులను అజ్ఞాతవాసి' తిరగరాయనున్నది. హారిక, హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్ రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే విడుదలైన పవన్ ఫస్ట్‌లుక్‌కు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జనవరి 10న ఫ్యాన్స్‌కు పండుగే పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అజ్ఞాతవాసిలో కీర్తి సురేష్, అను ఇమ్మాన్యుయేల్ కథానాయికలు. అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలు సమకూరుస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అంకితభావంతో పని చేస్తేనే సత్ఫలితాలు



### విశాఖ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ వార్షిక తనిఖీలు

### సంతృప్తిని వ్యక్తం చేసిన రేంజ్ డిఐజి సిహెచ్. శ్రీకాంత్

విశాఖ క్రైం : నిరంతరం ప్రజాస్వామ్యంలో శాంతి భద్రతల పరిరక్షణలో తలమునకలై ఉన్న పోలీసు సిబ్బంది అంకిత భావంతో పని చేసిన నాడే సత్ఫలితాలు లభిస్తాయని విశాఖపట్నం రేంజ్ డీఐజీ సిహెచ్. శ్రీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నం రేంజ్ పరిధిలో ఉన్న విశాఖ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ వార్షిక తనిఖీలలో భాగంగా డీఐజీ శ్రీకాంత్ తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా కైలాసగిరి పెరేడ్ మైదానంలో జిల్లా ఆర్మ్‌డ్ పోలీసు పెరేడ్‌ను వీక్షించి, అనంతరం వారి వద్ద నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం డీఐజీ శ్రీకాంత్ ఆర్మ్స్ డ్రిల్, స్క్వాడ్ డ్రిల్, లాఠీ డ్రిల్ మరియు పీటీ మొదలైనవి వీక్షించారు. అదే విధంగా వివిధ విభాగాలైన బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఆయుధాగారం, మోటారు విభాగం, స్పోర్ట్స్, కార్యాలయం యొక్క రికార్డులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో ఆయా అన్ని విభాగాలలో డీఐజీ శ్రీకాంత్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ





- జి. శ్రీకాంత్, అదనపు ఎస్పీ (అడ్మినిస్ట్రేషన్) - సిద్ధార్థ కౌశల్, అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) - ఎన్ఎస్ఎస్ శేఖర్, డిఎస్పీ ఆర్మ్‌డ్ రిజర్వ్ - బి. గౌరీశ్వరరావు, పి. నాగేశ్వరరావు, ఎం.వి. వెంకట రమణ, పి. సుబ్రహ్మణ్యం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టీమిండియా ముమ్మర సాధన

## జట్టులోకి రహానె!

మొహాలి: శ్రీలంకతో తొలి వన్డేలో దెబ్బతిన్న టీమిండియా రెండో వన్డేలో గెలవాలని పట్టుదలతో ఉంది. పర్యాటక జట్టును ఓడించి 1-1తో సిరీస్ సమం చేయాలని కసిగా కనిపిస్తోంది. ధర్మశాల మాదిరిగానే రెండో వన్డే జరిగే మొహాలి సైతం పేస్‌కు అనుకూలించే పిచ్. ఈ నేపథ్యంలో రోహిత్‌సేన మంగళవారం ముమ్మర సాధన చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ, ఎంస్ ధోనీ, శిఖర్ ధావన్, అజింక్య రహానె, భువనేశ్వర్ కుమార్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్య, శ్రేయస్ అయ్యర్, కుల్‌దీప్ యాదవ్ సాధన చేశారు.

వస్తున్నాడా?

రాహుల్ ద్రవిడ్ వారసుడిగా భావించే అజింక్య రహానె ఆటతీరు పేస్ పిచ్‌లకు సరిగ్గా సరిపోతుంది. మొహాలి మ్యాచ్ ఉదయం 11:30 గంటలకు ప్రారంభం అవుతుంది. ధర్మశాలలో లాగే ఇక్కడా మంచు ప్రభావం ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. శ్రీలంక బౌలర్లు సురంగ లక్మల్, నువాన్ ప్రదీప్, ఏంజెలో మాథ్యూస్ దెబ్బకు గత వన్డేలో టీమిండియా 29 పరుగులకే 7 వికెట్లు నష్టపోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. దాదాపు నలుగురు బ్యాట్స్‌మెన్ ఆడదామా వద్దా అని సందేహిస్తూనే స్లిప్‌లో క్యాచ్‌లు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రహానెను ఎందుకు తీసుకోలేదని చాలా ప్రశ్నలు వచ్చాయి. దీంతో రెండో వన్డేలో జట్టు మేనేజ్‌మెంట్ అజింక్యను ఆడిస్తుందని అందరూ అంచనా వేస్తున్నారు. ఏం జరుగుతుందో బుధవారమే తెలియనుంది.

# ప్రపంచ ఐరన్‌మేన్‌గా పరవాడ కృష్ణ



ప్రపంచ ఐరన్ మేన్ పోటీలలో పాల్గొని విశాఖకు వన్నె తెచ్చిన పరవాడ కృష్ణను అభినందిస్తున్న సీపీ టి. యోగానంద్, తదితర పోలీసు అధికారులు

### ఏపీ పోలీస్‌కు అరుదైన గౌరవం

### కృష్ణను ఘనంగా సత్కరించిన సీపీ యోగానంద్

విశాఖ సిటీ : ప్రపంచ ఐరన్ మేన్ పోటీలలో పాల్గొని విశాఖకు చెందిన సిటీ పోలీస్ కానిస్టేబుల్ పరవాడ కృష్ణ తన అద్భుత ప్రతిభను కనబరిచినట్లు సిటీ పోలీస్ కమిషనర్ టి. యోగానంద్ పేర్కొన్నారు. మంగళవారం పోలీసు కమిషనర్ కృష్ణగురించి వివరిస్తూ ప్రపంచ ఐరన్ మేన్ (3.8 కి.మీ. ఈత, 180 కి.మీ. సైక్లింగ్, 42 కి.మీ. రన్నింగ్) పోటీలలో విశాఖకు చెందిన సిటీ కానిస్టేబుల్ పరవాడ కృష్ణ (భీమిలి ట్రాఫిక్ పోలీసుకు చెందిన) పాల్గొన్నారు.

ఈ నెల 3వ తేదీన నిర్వహించిన ప్రపంచ ఐరన్ మేన్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ నుండి మాత్రమే కాక మొత్తం ప్రపంచంలో మొత్తం 41 దేశాల నుండి సుమారు 3200 మంది పాల్గొన్నట్లు తెలిపారు.

అందులో కృష్ణ తన వయసుకు సంబంధించిన గ్రూపులో 101వ స్థానంలో నిలిచి దేశ కీర్తిపతాకాన్ని ఎగుర వేయడం ఎంతైన గర్వకారణమని అన్నారు.

ఈ కార్యక్రమంనందు డిసిపి క్రైం డాక్టర్ షిముషి బాజ్పాయ్, ఏడీసీపీ (స్పెషల్ బ్రాంచ్) రవికుమార్, ఏసీపీ (ట్రాఫిక్) కింజరాపు ప్రభాకర్, ఏసీపీ (సీఏఆర్) సాల్మన్, సిఐ (ట్రాఫిక్) సిహెచ్ శ్రీనివాసరావు, ఆర్ఐ (అడ్మిన్) టివిఎస్ఆర్‌కె కుమార్, మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జివియంసి స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు

### 39వ వార్డులో స్థల, భవన వివాదాల పరిశీలన

### ప్లాన్‌ల కనుగుణంగా నిర్మాణం చేయాలి

### ప్రశాంతి స్పిరిట్యువల్ పార్క్ సందర్శన

### తెన్నేటి విశ్వనాధం సంక్షేమ సంఘం పార్కు పరిశీలన

### యువత ఆటలకు ప్రాధాన్యత నివ్వాలి

### జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం : జి.వి.యం.సి స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా నాలుగవ జోన్ 39వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మురళీనగర్ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ దగ్గరలో వివాదాస్పదంగా ఆక్రమించి మూడంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నందున దానిని పరిశీలించారు. ఏసిపి రాజేశ్వరరావును వివరణ కోరగా కోర్టులో వివాదం పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. అనంతరం మురళీనగర్ సెక్టర్-5 లో వర్మ కాంప్లెక్స్ ప్రక్కన ఆక్రమంగా భవన నిర్మాణం జరుపుతున్నట్లు కాలనీ వాసులు వివరించగా పరిశీలించారు.

కోర్టులో వివాదం ఉన్నట్లు పేర్కొనగా వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. గతంలో జరిగిన పొరపాటును అందరు ఇబ్బంది పడవల్సివస్తోందని, వుడా మాస్టర్ ప్లాన్ ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం ప్రశాంతి స్పిరిట్యువల్ పార్కును సందర్శించి సూచనలు చేశారు. తదుపరి మాధవధార తెన్నేటి నగర్‌లోని తెన్నేటి విశ్వనాధం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించారు. యువత ఆటలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. కొంత స్థలాన్ని ఆట స్థలంగా, మిగిలిన స్థలాలను మొక్కలు పెంపకంతో సుందరీకరించాలని పేర్కొన్నారు.

**తెన్నేటి విశ్వనాధం సంక్షేమ సేవా సంఘానికి అభినందనలు**

తెన్నేటినగర్ పార్కును స్థానికులే అభివృద్ధి చేసుకోవడం తమకు ఎంతో అనందంగా ఉందని జివిఎంసి కమిషనర్ హరినారాయణ్ అన్నారు. మంగళవారం 39వ వార్డు తెన్నేటినగర్ ప్రాంతంలో ఉదయం 7 గంటలకు పర్యటించారు. జివిఎంసి మీద ఆధారపడకుండా స్థానికులు సొంత నిధులతో ఏర్పాటు చేసుకోవడం యువత ఇటువంటి కార్యక్రమంలో నిలవడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలను అభివృద్ధి చేస్తున్న తెన్నేటి విశ్వనాధం సంక్షేమ సేవా సంఘాన్ని అభినందించారు. మరో నెల రోజుల్లో జివిఎంసి నుండి హైమాస్ట్ల దీపాలను ఎర్పాటు చేయ్యనున్నట్లు తెలిపారు.

నెల రోజుల పాటు తాత్కలిక దీపాలను ఏర్పాటు చేయ్యనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్-4 జోనల్ కమిషనర్ రమణమూర్తి, హెల్త్ అఫిసర్ మురళీమోహన్, టౌన్ ప్లానింగ్ ఎసిపి రాజేశ్వరరావు, నగర తెలుగు యువత ఉపాధ్యక్షుడు సనపల వరప్రసాద్, తెన్నేటి విశ్వనాధం సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు నంబాళ్ళ ఈశ్వరరావు, కార్యదర్శి సీపాన రాము, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

తదుపరి నరేంద్రనగర్‌లో ఆక్రమణకు గురైన భవనాన్ని తొలగించడాన్ని పరిశీలించారు. స్థలాలను ఆక్రమించి, సరైన ప్లాన్, అనుమతులు లేకుంటే కూల్చివేత తప్పదని తెలిపారు. పర్యటనలో నాలుగవ జోనల్ కమిషనర్ యస్.రమణమూర్తి, ఏ.యం.ఓ.హెచ్ డా.మురళీ మోహన్, ఏసిపి రాజేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.చిట్టిబాబు, పట్టణ ప్రణాళికా సిబ్బంది పాల్గోన్నారు.

# స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఏర్పాటు చేస్తాం




ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఏయూలో విద్యా విభాగం, ఐఏఎస్ఇలను మిళితం చేస్తూ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటు చేస్తామని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు అన్నారు. మంగళవారం ఉదయం ఏయూ విద్యా విభాగ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా విభాగంలో బిఇడి, ఎంఇడి విద్యను అభ్యశిస్తున్న విద్యార్థులు మంచి ఉపాధ్యాయులుగా నిలవాలనన్నారు.

విభాగాధిపతి ఆచార్య జి.లచ్చన్న మాట్లాడుతూ విద్యా విభాగం 1971వ సంవత్సరం నుంచి సేవలు అందిస్తోందన్నారు. విభిన్న శాఖలుగా విస్తరించి సమాజానికి అవసరమైన నిపుణత, నిబద్దత కలిగిన అధ్యాపకులను తయారు చేస్తోందన్నారు. విభాగ బిఓఎస్ చైర్మన్ ఆచార్య నిమ్మ వెంకట రావు మాట్లాడుతూ సమా జంలో విశిష్టమైన వృత్తిగా ఉపాధ్యాయ వృత్తి నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో విభాగ విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com